# సింగిల్ పేజీ కథలు

## 'సెల్' పోజు

కాంబాబు ఐదోసారి గెంతాడు తన కోరిక తీర్చుకోవడానికి. తండ్రి సన్యాసిరావు ఉదయం నుండి కాంబాబు గోల చూస్తున్నాడు. తోక కాలిన కోతిలా గెంతులు పెట్టడాన్ని. విషయం ఏమిటంటే కాంబాబు సెల్‌ఫోన్ కొని పెట్టమన్నాడు. తండ్రి కుదరదన్నాడు. కాదు కొనిపెట్టాలి లేకపోతే ఇల్లు విడిచి పోతానన్నాడు. వీడి బాధపడలేక తండ్రి సన్యాసిరావు తలవంచాడు. సన్యాసిరావుకి బట్టల వ్యాపారం ఉంది. ఆయనకు కాంబాబు ఒక్కడే కొడుకు! కాంబాబు స్థానిక డిగ్రీ కాలేజీలో బికామ్ ఫైనల్ ఇయర్ వెలగబెడుతున్నాడు. సెల్‌ఫోన్ ఎంత దర్జా! స్కూటర్ ఉన్నా చూడటం లేదు. పది మందిలో సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుంటే, ప్రక్కవాళ్ళు ఈర్ష్యగా చూస్తుంటే..ఒహో..ఎంత థ్రిల్..ఇలా సాగుతున్నాయి కాంబాబు ఆలోచనలు. సరే సన్యాసిరావు, కాంబాబు బాధపడలేక సెల్ కొనిచ్చాడు. బాగా అవసరమయితే తప్ప తండ్రి ఫోన్ మాట్లాడడు. క్రొత్తసెల్‌ని చూసుకొన్న కాంబాబు ముఖం చిచ్చుబుడ్డిలా వెలిగింది.

★ ★ ★

కాంబాబు సెల్‌ఫోన్ కొన్న శుభసందర్భంలో ఫ్రెండ్స్ అందరికీ మటన్, మందు పార్టీ ఇచ్చాడు. అందరికీ సెల్ నెంబరు ఇచ్చి మర్నాడు గంటకొకడ్ని ఫోన్ చెయ్యమన్నాడు. మందు పార్టీ తీసుకొన్న వాళ్ళుకదా! అలాగే చేస్తామని ప్రామిస్ చేసారు వాళ్ళు.

★ ★ ★

కాంబాబు 'సెల్ ఫోన్ తీసుకొని రోడ్డుమీదకి వచ్చాడు. సమయం ఉదయం పది అయ్యింది. కొద్దిసేపు హోటల్‌లో కూర్చున్నాడు. సెల్ మ్రోగలేదు. ఒక గంట తర్వాత సైబర్ కేఫ్‌లో కూర్చున్నాడు. సెల్ గురించి వెయిట్ చేసాడు. సెల్ మ్రోగలేదు. కొద్దిగా నిరాశపడ్డాడు. మళ్ళీ గంట తర్వాత బస్‌స్టాప్ దగ్గర వెయిట్ చేసాడు. మళ్ళీ సెల్ మ్రోగలేదు. అలా సాయంత్రం వరకూ అక్కడా, ఇక్కడా తిరిగాడు. కిళ్ళీకొట్టు దగ్గర సిగరెట్ కాలుస్తుంటే ఒక పోలీసు దగ్గరికి వచ్చి ''ఒకసారి వస్తారా నాతో'' అని పిలిచాడు.

కాంబాబు, పోలీసు మనుషులు లేని చోటు నిలడ్డారు.

''చెప్పండి ఏమిటీ విషయం?'' అడిగాడు కాంబాబు.

''ప్రొద్దుటనుండి చూస్తున్నా! కాస్సేపు అక్కడ, కాస్సేపు ఇక్కడ తిరుగుతావు! వాటం చూస్తే ఉదయం ఇళ్ళు చూసుకొని రాత్రికి కన్నం వేసేవాడిలా ఉంది. ఏమిటీ సంగతి'' అడిగాడు పోలీసు.

''రామ రామ నేను సెల్ గురించి వెయిట్ చేస్తున్నా'' అని తన గురించి, తన తండ్రి గురించి చెప్పి, లక్కీగా కాలేజి ఐడెంటిటీ కార్డు చూపించి బయటపడ్డాడు.

★ ★ ★

మర్నాడు ఫ్రెండ్ జగదీష్ కాలరుబుచ్చుకొని ''ఒరే నా డబ్బుతో మటన్, మందూ కొట్టేసి చిన్న ఫోన్ చెయ్యరట్రా...నాకూ'' అని అడిగాడు.

''మీవల్లే కదా పోలీసు వాడి దృష్టిలో పడ్డాను'' అని గోలపెట్టాడు.

''సరే! ఆ సెల్ ఇలా ఇయ్యి!'' అని సెల్ చూసి

''బాబూ! సెల్ కొనుక్కోగానే సరిపోదు! అది ఆఫ్‌లో ఉందో 'ఆన్'లో ఉందో చూసుకోవాలి. నువ్వు సెల్ ఆఫ్‌లో పెట్టుకొని మేము ఫోన్ చెయ్యలేదని గోలపెడతావేం!'' అని జవాబిచ్చాడు జగదీష్.

సెల్ ఆఫ్‌లో ఉండడం చూసి నాలిక కరుచుకొన్నాడు కాంబాబు.

మిత్రుడిని అనవసరంగా అనుమానించినందుకు కూల్ డ్రింక్ అంటూ కాంబాబు నుంచి పాతికరూపాయలు ఖర్చుపెట్టిచ్చేడు జగదీష్.

★ ★ ★

''ఊరికే సెల్‌ఫోన్‌తో తిరగడం కాదు. కాస్త పనికొచ్చే పనులు చెయ్యాలి'' అన్నాడు సన్యాసిరావు.

''ఏం చెయ్యాలి? చెప్పు సూటిగా''

''రేపు బ్యాంక్‌కి వెళ్ళి పదివేలు డ్రా చేసుకొని పట్టుకురా! అర్జెంటు'' అన్నాడు సన్యాసిరావు.

''అలాగే!'' అన్నాడు కాంబాబు. సెల్‌ఫోన్‌ని ప్రక్కన పెట్టుకొని నిద్రపోతూ.

కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు బ్యాంక్ దగ్గర కాంబాబు 'సెల్' తీసుకుని, టోకెన్‌తో క్యూలో నించున్నాడు. డబ్బు కోసం క్యాష్ కౌంటర్ దగ్గర. క్యాషియర్ గుర్నాథం చాదస్తపు మనిషి. ఒక్క డబ్బు కట్టను నాలుసార్లు లెక్క పెడితే గాని వదలడు. మధ్యలో ఎవరైనా దగ్గినా, మాట్లాడినా కౌంటింగ్ ఆపేసి మళ్ళీ మొదటినుండీ లెక్క పెడతాడు. ఈ సీనియర్ మోస్ట్ 'గోస్ట్' ను బ్యాంక్ భరిస్తోంది! క్యూలో ఉండగానే కాంబాబు సెల్ మ్రోగింది. కాంబాబు ఆనందం పట్టలేకపోయాడు.

''నేను సీతల పరాంకుశాన్ని!'' అంది అవతలకంఠం!

''చెప్పరా చెప్పు చాలాకాలానికి..'' అంటూ గడగడా మాట్లాడుతున్నాడు కాంబాబు. మిగతావాళ్ళు ఏమిటీగోల అంటూ చూస్తున్నారు కాంబాబుకేసి

గుర్నాథం కౌంటింగ్‌కి డిస్ట్రబ్ అయ్యింది. ఆవేశం పట్టలేకపోయాడు.

''బాబూ! ఎవరా సెల్ గోల! నాలెక్క తప్పయి, ఎక్కువ డబ్బు ఇస్తే, ఉద్యోగం ఊడుతుంది. పిల్లల గలవాడ్ని! తరువాత నేను ప్రత్తిరైతుని చేరుకోవాలి! చచ్చిన ఎలకపిల్లని పట్టుకొచ్చినట్లు ఎందుకు ఈ బ్యాంక్‌కి సెల్! అలా దూరంగా ఫో'' అన్నాడు గుర్నాథం.

''ఏమిటీ! నా సెల్‌ని చచ్చిన ఎలక పిల్లతో పోలుస్తావా? ఇప్పుడే మేనేజర్ దగ్గరికి పోతా'' అంటూ కాంబాబు పెద్దగా అరిచి మేనేజర్ దగ్గరికి పోయాడు.

''ఏంటండి? మీ క్యాషియర్! మా ఎక్కౌంట్లు అన్నీ క్లోజు చేస్తాను! నన్ను అన్నా ఫరవాలేదు నా సెల్‌ని అన్నాడు. అది క్షమించను'' అన్నాడు కాంబాబు ఆవేశంగా ఊగిపోతూ!

మేనేజర్ నేను సర్దిచెప్తాగా అంటూ కాంబాబుకు నచ్చ చెప్పాడు.

కాంబాబు నాన్న పెద్ద కస్టమర్ మరి!

ఆరోజు గుర్నాథం క్యాష్ టాలీ చేసి ఇచ్చేటప్పటికి రాత్రి పది అయ్యింది. పూర్వ జన్మ కృతం పాపం బ్యాంక్ మేనేజర్ ఉద్యోగం అనుకున్నాడు బ్యాంక్ మేనేజర్!

★ ★ ★

ఇందిరాపార్క్!

కాంబాబు, అతని గర్ల్‌ఫ్రెండ్ రజని కూర్చుని ఉన్నారు.

''ఏదైనా మాట్లాడు'' అంది రజని.

సరిగ్గా అదే సమయంలో కాంబాబు సెల్ మ్రోగింది.

''ఒన్ మినిట్'' అంటూ ''చెప్పరా'' అన్నాడు.

''నేను మిడతల మన్మథరావుని అర్జెంటుగా ఒక వెయ్యి సర్దగలవా'' అంది అవతలి కంఠం!

''డబ్బు చెట్లకి కాస్తోందా?'' అని మొదలుపెట్టి అప్పు, దాన్ని తీసుకోవడం వల్ల వచ్చే అనర్ధాలు గురించి కాంబాబు అరగంట సెల్‌లో లెక్చర్ ఇచ్చాడు. అతనికి చాలా తృప్తిగా ఉంది. చాలాకాలానికి ఎక్కువ సేపు మాట్లాడానని. తరువాత సెల్ ఆఫ్ చేసి ప్రక్కకి చూస్తే రజని లేదు! వెళ్ళిపోవడానికి బైక్‌ని స్టార్ట్ చేయబోతోంది!

''సారీ! కాస్సేపు మాట్లాడుకుందాం'' అన్నాడు.

''మాట్లాడాలా? వర్షాకాలంలో ఆకుపచ్చని గ మొలుచును. నీరు ఎత్తు నుండి పల్లం కు ప్రవహించును. ఇది ఆర్డినరీ ఏ బ్సు ఎక్కడ చెయ్యి ఎత్తితే అక్కడ ఆపబడును'' అంది రజని కోపంగా!

''నా డబ్బుతో లిమ్కా తాగి, ఐస్‌క్రీమ్ ఆ గించి ఇటువంటి జీవిత సత్యాలు చెప్తావా? అహో నా జన్మ ధన్యమయింది గా! హు'' అంటూ జుట్టు పీక్కున్నాడు కాంబాబు.

''ఇంకోసారి 'సెల్'తో వస్తే ఇంతకన్నా చెత్తగా మాట్లాడతాను'' అని వార్నింగ్ ఇచ్చింది రజని.

సెల్ ఖర్చు పెరుగుతోందని సన్యాసిరావు తిడుతున్నాడు. ఇంకా ఒక కోరిక మిగిలిపోయింది కాంబాబుకి! అదేమిటంటే 'సుజుకి' నడుపుతూ సెల్ మాట్లాడాలని! ఆరోజు కోసం చూస్తున్నాడు.

ఫ్రెండ్ జగదీష్ 'సుజుకి' తీసుకొని, సెల్‌ని చెంకి, భుజానికి మధ్యన ఇరికించి కె.పి.హెచ్.బి. మెయిన్‌రోడ్ మీద పోతున్నాడు వేగంగా! అతనికి ఫోన్ వచ్చింది రాజమండ్రి రాంబాబు అని చిన్ననాటి స్నేహితుడు. ఈమధ్యే యు.ఎస్. నుండి తిరిగి వచ్చాడట! అతను మాట్లాడుతుంటే ఒళ్ళు తెలియలేదు కాంబాబుకి!

''అలాగే నేను వచ్చేస్తా! యు.ఎస్.కి! డాలర్లే డాలర్లు'' అంటూ అరిచి ఎదురుగా వస్తున్న కారుని గుద్దేశాడు కాంబాబు.

★★★

హాస్పిటల్‌లో రెండు కాళ్ళకి కట్లు కట్టించుకొని దిగులుగా ఉన్నాడు కాంబాబు. ''మళ్ళీ సెల్ జోలికి పోయావా మళ్ళీ నీ కాళ్ళు నేనే విరిచేస్తా'' అన్నాడు సన్యాసిరావు.

కాంబాబు మాట్లాడలేదు. పార్టీ తీసుకున్న మిత్రులెవ్వరూ పలకరించడానికి రాలేదు.

రజని వచ్చింది. కాంబాబుని చూడడానికి కొత్త బాయ్ ఫ్రెండ్‌తో!

'సెల్లో ఎంత పనిచేసావ్!' అంటూ మూలిగాడు కాంబాబు.

'గర్ల్‌ఫ్రెండ్ పోయిందీ! కాలువిరిగిందీ..' అంటూ గొణుక్కున్నాడు. ప్రస్తుతం రాంబాబు కాలు బాగుపడ్డాక పబ్లిక్ టెలిఫోన్ దగ్గర రూపాయి పావలా ఇచ్చి అవసరమయిన ఫోనులు మాత్రమే చేస్తున్నాడు.-

**ఎం. వీరేశ్వరరావు (హైదరాబాద్)**

# హస్తవాసి

రత్తాలు మెల్లగా వచ్చి మాధవి పక్కన కిందగా కూర్చుని కాళ్ళొత్తుతూ ''అమ్మా, నీ హస్తవాసి చాలా మంచిది! కిందటి ఏడు ఓ చీర ముందుగాల నీవే ఇచ్చావుగద! ఆ తరవాత వరసగా అందరమ్మలు తలో పాత చీర ఐదిళ్లవాళ్ళూ నేనడగక మునుపే ఇచ్చేసారు. అందుకనీ... అందుకనీ... '' అంటూ నసుగుతూంటే-

''ఆఁ అందుకనీ..'' మాధవి కాస్త గట్టిగా అంది.

''అందుకనీ, ఈ ఏడాది కూడా నువ్వు ముందుగా ఓ పాత చీర యిచ్చి పుణ్యం కట్టుకో! నీ హస్తవాసి చాలా మంచిది. కాదనకు, లేదనకు. అమ్మా నీ కళ్లుమొక్కుతా..''

మాధవి మురిసిపోయింది మనసులోనే, తన హస్తవాసి అంత మంచిదా అనుకుంటూ! ఇంకేం, లేచి వెళ్ళి ఓ మంచి చీర పట్టుకొచ్చి యిచ్చింది. చీరే కాదు, ఓ రెండు జాకెట్లూ తెచ్చిచ్చింది. రత్తాలు ఆనందంగా వెళ్ళిపోయింది. కాళ్ళు మొక్కి మరీ!!

★★★

సుధ రమ్మంటే మాధవి తీరుబడి చేసుకుని రెండు రోజుల తర్వాత పక్కింటికి వెళ్ళింది. లోపల ఏదో మాటలు వినబడుతూంటే గుమ్మంలోనే ఆగిపోయింది. ''అమ్మా నీ హస్తవాసి చాలా మంచిది. కిందటి ఏడు నీవు తొలిగా చీరిస్తేనే మరో ఐదిళ్ళ వాళ్ళింటి దగ్గర నుంచి నేనడగకున్నా నాకు తలో పాత చీర ఆటోమేటిక్‌గా వచ్చేసింది.



అందుకే ఈ ఏడూ నీవే తొలిగా పాత చీర యిచ్చి పుణ్యం కట్టుకో!'' అంటూ సేమ్ గొంతు సేమ్ డైలాగులు వినిపించేసరికి మాధవి ఆశ్చర్యపోయి చటుక్కున లోపలికి వచ్చింది.

ఈలోగానే ఓ మంచిచీరా ఓ బ్లౌజు ఓ పాత లంగా తెచ్చి ఇచ్చేసింది సుధ, రత్తాలుకి. మాధవి లోపలికి రాగానే రత్తాలుని గుర్రుగా చూసింది. రత్తాలుకి సీన్ అర్థమయిపోయి-

''క్షమించండమ్మా...ఏదో పేదవాళ్ళం! నాలుగు కబుర్లు చెప్పుకుని, ఏ ఎండకాగొడుగు పట్టుకుని, బతికేస్తుంటాం. మీలా చదువుకున్నోళ్ళం కాదుకదా'' అంది భయపడుతూనే.

అసలు విషయం అర్థం కాని సుధ, నవ్వుతూ తనని పొగిడినందుకు మాధవి కుళ్ళిపోతోందా అనుకుంటూ గర్వంగా ''కలిగిన వాళ్ళం మనమివ్వక, వాళ్ళకి ఎవరిస్తారు చెప్పు?'' అంది.

'హస్తవాసికర్థం పాపం సుధకేం తెలుసు' మాధవి మనసులోనే అనుకుంది నోరుమెదపక.

రత్తాలు, 'ఇకపై ఈ అమ్మ దగ్గర ఈ ట్రిక్ పనికిరాదు. పై ఏటికి మరోటి ఆలోచించాలి' అనుకుంటూ వెళ్ళిపోయింది.

'హస్తవాసులు, బోణీబేరాలు' అని కథ చెప్పే ఎవరిపొగడ్తలూ ఎవరూ నమ్మకూడదు' అని మనసులోనే నిశ్చయించుకుంది మాధవి. రత్తాలు నోటిలో మట్టికొట్టడం యిష్టం లేక సుధకి అసలు విషయం చెప్పలేదు.

**-జి. రామలక్ష్మి (హైదరాబాద్)**